పీజేఆర్ క్రీడా మైదానం బురదమయం

- భారీగా నిలుస్తున్న వర్షం నీరు
- ఆడుకునేందుకు ఇబ్బంది పడుతున్న క్రీడాకారులు
- పట్టించుకునే వారు కరువు


పీజేఆర్ క్రీడా మైదానంలో నిలిచిన వర్షం నీరు

యూసుఫ్‌గూడ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): యూసుఫ్‌గూడ డివిజన్ పరిధి లక్ష్మీనరసింహనగర్‌లోని పీజేఆర్ క్రీడా మైదానం సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. మైదానం ఎదుట ఉన్న సీసీ రోడ్డు ఎత్తు కంటే మైదానం లోపల కిందకు ఉంటుంది. దీనివల్ల వర్షంనీరు బయటకు పోవడం లేదు. వర్షం వచ్చిన ప్రతీసారి వరదనీరు మైదానంలోకి చేరుతోంది. బురద పేరుకుపోతుండడంతో క్రీడాకారులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు.

పేరుకుపోతున్న వ్యర్థాలు..

పీజేఆర్ క్రీడా ప్రాంగణాన్ని నెలల తరబడి శుభ్రం చేయడం లేదు. దీంతో మైదానంలో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయి దోమలకు, ఈగలకు నిలయంగా మారింది. దీనికితోడు మైదానంలో ఉన్న మట్టికుప్పలు క్రీడాకారులు ఆడుకోవడానికి ఇబ్బంది కలిగిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి క్రీడా మైదానం లోపల శుభ్రం చేసే లా జీహెచ్ఎంసీ శానిటేషన్, పారిశుధ్య సిబ్బందిని ఆదేశించాలని క్రీడాకారులు కోరుతున్నారు.



క్రీడా మైదానం ముఖద్వారం

ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి



క్రీడా మైదానానికి ఓ పక్క ఫెన్సింగ్ లేదు. ప్రాంగణంలో క్రికెట్ ఆడుకుంటున్నపుడు బంతి బయట పడుతుంది. దీంతో ఇబ్బంది అవుతుంది. సమీపంలోని ఇళ్ల వారు బూతులు తిడుతూ కొట్టడానికి వస్తున్నారు. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు కల్పించుకొని పీజేఆర్ క్రీడా మైదానానికి ఓ పక్క ఇనుప ఫెన్సింగ్ ఏర్పాటు చేయించాలి.

● ఆర్.కార్తీక్, క్రీడాకారుడు

బల్లాలు ఏర్పాటు చేయాలి



చుట్టుపక్కల బస్తీలకు పీజేఆర్ క్రీడా మైదానం ఒక్కటే ఉన్నది. ప్రతీ రోజు సాయంత్రం పిల్లలందరం ఆడుకుంటాం. ఆదివారం ఎక్కువ మంది ఆడుకోవడానికి వస్తున్నారు. ఆట ఆడిన క్రీడాకారుడు అలసిపోయి కూర్చోవడానికి బల్లాలు లేవు. మైదానం లోపల బల్లాలను ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

● కె.జయంత్, లక్ష్మీనరసింహనగర్

చెత్త ఎత్తడం లేదు



క్రీడా మైదానంలో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతుంది. జీహెచ్ఎంసీ పారిశుధ్య కార్మికులకు చెప్పినా శుభ్రం చేయడం లేదు. మైదానం లోపల వ్యర్థాలు పేరుకుపోయాయి. చాలా రోజుల నుంచి ఉన్న మట్టికుప్పలను తొలగించాలి.

● జి.ప్రదీప్, విద్యార్థి

ఆరు మీటర్లు ఉండాల్సిన నాలా అర మీటర్

● ప్రకాశ్‌నగర్ నాలాను సందర్శించిన హైడ్రా కమిషనర్

బేగంపేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): చిన్నపాటి వర్షం వచ్చినా ప్రకాశ్‌నగర్ ప్రధాన రహదారిలో నాలుగు అడుగుల వర్షం నీరు చేరుతుంది. ఈ సమస్యపై కొంతకాలంగా హైడ్రా అధికారులు దృష్టి సారించారు. విమానాశ్రయం నుంచి వచ్చే వర్షపు నీరు పెట్రోల్ బంక్, రహదారి కింద నుంచి రోడ్డు అవతల ఉన్న ప్రకాశ్‌నగర్ వైపునకు వెళ్తుంది. ఈ క్రమంలో ఇక్కడ ఆరు మీటర్ల నాలా గతంలో ఉండేది. 25 సంవత్సరాలుగా ఈ నాలాపై ఆక్రమణలు పెరిగిపోవడంతో నాలా పూర్తిగా కుచించుకుపోయింది. హైడ్రా కమిషనర్ రంగనాథ్ గురువారం ప్రకాశ్‌నగర్ నాలా ప్రాంతంలో పలు శాఖల అధికారులతో కలిసి పర్యటించారు. నాలాను పరిశీలించారు. నందిని హోటల్ వద్ద ఆరు మీటర్లు ఉండాల్సిన నాలా అరమీటర్ ఉందనే విషయాన్ని గుర్తించారు. అక్కడ నుంచి దిగువకు వెళ్లే క్రమంలో భారీ భవనాలు నిర్మించిన చోట ఈ నాలా రెండున్నర మీటర్లు ఉంది. ఇలా దాదాపు ఒక కిలోమీటర్ దూరం వరకు నాలా ఆక్రమణలకు గురైందనే విషయం వెలుగులోకి రావడంతో దీనిపై రెండు రోజుల్లో సమగ్ర వివరాలు అందజేయాలని జీహెచ్ఎంసీ, ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. నాలాపై నిర్మించిన భవనాలకు అనుమతులు ఎవరు ఇచ్చారని అక్కడ ఉన్న అధికారులను ప్రశ్నించడంతో వారు నీళ్లు నమిలారు. ప్రధాన రహదారిలోని నందిని హోటల్ నుంచి భారీ అపార్ట్‌మెంట్ వరకు నాలా కబ్జాకు గురైందని ఈ సందర్భంగా రంగానాథ్ తెలిపారు. ఆరు మీటర్ల నాలా విస్తరణకు అవసరమైన ఏర్పాట్లను రెండు రోజుల్లో తీసుకోవాలని అధికారులకు సూచనలు చేశారు.


ప్రకాశ్‌నగర్‌లో నాలా కబ్జా అయిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్


జంగయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న వడ్డెరసంఘం ప్రతినిధులు

ఇందిరానగర్ బస్తీ వ్యవస్థాపకుడికి ఘన నివాళి

బోరబండ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రహ్మత్‌నగర్ డివిజన్ ఇందిరానగర్ బస్తీ వ్యవస్థాపకుడు ఎత్తరి జంగయ్య 14వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహం వద్ద పలువురు వడ్డెర సంఘం నాయకులు గురువారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇళ్లులేని ఎంతోమందికి గూడు కల్పించిన సహృదయుడు జంగయ్య అని కొనియాడారు. జంగయ్య ఆశయ సాధనకు పాటుపడతామని తెలిపారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం తెలంగాణ(గన్నుదెబ్బ) అధ్యక్షుడు ఎత్తరి అంతయ్య, ఎత్తరి యాదయ్య, మోహన్‌కుమార్, పార్వతమ్మ, జంగమ్మ, విష్ణు, లత, శ్రవణ్‌కుమార్, శ్రీశైలం, డి.అనంతరావు, పల్లపు యాదయ్య, పల్లపు గణేశ్, పల్లపు రమేశ్, మాగని రాజునాయక్, కురుమయ్య, ఇందిరానగర్ బస్తీవాసులు, జంగయ్య అభిమానులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌ల ఆక్రమణల వల్ల ట్రాఫిక్ ఆటంకాలు

బంజారాహిల్స్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఫుట్‌పాత్ వ్యాపారాల కారణంగా ట్రాఫిక్ ఆటంకాలు ఏర్పడుతున్నాయని పశ్చిమ మండలం ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్ అన్నారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.12 ఎమ్మెల్యే కాలనీలోని లోటస్‌పాండ్ వద్ద ఫుట్‌పాత్ వ్యాపారులకు ఆయన గురువారం కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ కొన్నిప్రాంతాల్లో ఫుట్‌పాత్ వ్యాపారులు రోడ్డును ఆక్రమించడం వల్ల వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకాలు ఏర్పడుతున్నాయన్నారు. ఈ ప్రభావం కీలక జంక్షన్‌లలో ట్రాఫిక్‌పై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయని చెప్పారు.

8న గాంధీభవన్ ఎదుట గాజులు, చీరెలతో నిరసన


అభివాదం చేస్తున్న నంగారా బేరి లంబాడీ హక్కుల పోరాట సమితి నాయకులు

పంజాగుట్ట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గంలో లంబాడీలకు స్థానం కల్పించాలని నంగారా బేరి లంబాడీ హక్కుల పోరాట సమితి నాయకలుఉ డిమాండ్ చేశారు. మంత్రివర్గంలో స్థానం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 8న నాంపల్లిలోని గాంధీభవన్ ఎదుట చీరెలు, గాజులతో మహిళలు నిర్వహించనున్న నిరసన ప్రదర్శన, ధర్నాను విజయవంతం చేయాలని సమితి జాతీయ అధ్యక్షుడు ముడావత్ శ్రీనివాస్‌నాయక్ పిలుపునిచ్చారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సమితి జాతీయ సమన్వయకర్త ధారావత్ గణేశ్ నాయక్, గిరిజన విద్యార్థి సంఘం జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు వెంకట్ బంజారాతో కలిసి ఆయన మాట్లాడారు. తమ సంస్థ పేరు వాడుకుంటున్న వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని, వారిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని అన్నారు. అనంతరం సమితి రాష్ట్ర, మహిళా, యువజన విభాగం కార్యవర్గాన్ని ప్రకటించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా అజ్మీర ఫూల్‌సింగ్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా భూక్యా సంతోష్ నాయక్, రాష్ట్ర ఇన్‌చార్జిగా రంజిత్ నాయక్, రాష్ట్ర కన్వీనర్‌గా కె.రాజునాయక్, కో-కన్వీనర్‌గా పరుశురాం నాయక్, ప్రధాన కార్యదర్శులుగా అజ్మీర వెంకట్‌నాయక్, శ్రీనునాయక్, జలంధర్ నాయక్, సురేష్ నాయక్, బాలునాయక్, జైపాల్‌నాయక్, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్ నాయక్, గోపాల్ పవార్, రాజునాయక్, హరినాయక్, అధికార ప్రతినిధిగా జంపన్న నాయక్, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా సుశీల బాయి, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షురాలుగా పున్ని బాయి, ప్రధాన కార్యదర్శులుగా అనితాబాయి, దేవీబాయి, ఉపాధ్యక్షురాలుగా అచ్చి బాయి, సునీతాబాయి, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా రవి నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రమావత్ చిరంజీవి, ఉపాధ్యక్షుడిగా రాందాస్ నాయక్ నియమితులయ్యారు.

బీసీ జాబితా నుంచి తొలగించిన కులాలను మళ్లీ చేర్చవద్దు

పంజాగుట్ట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీసీ జాబితా నుంచి తొలగించిన ఆంధ్ర ప్రాంతానికి చెందిన 26 కులాలు, శెట్టిబలిజ కులాన్ని తిరిగి రాష్ట్ర జాబితాలో చేర్చవద్దని తెలంగాణ బీసీ-ఏ కులాల హక్కుల పరిరక్షణ సమితి డిమాండ్ చేసింది. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.బాగయ్య, రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ఎస్.నరహరి, సమితి నాయకులతో కలిసి మాట్లాడారు. ఏపీకి చెందిన 27 కులాలను రాష్ట్ర బీసీ జాబితా నుంచి తెలంగాణ ప్రభుత్వం తొలగించిందని, దీనిని ఉమ్మడి ఏపీ హైకోర్టు సమర్థించిందని అన్నారు. ఆ కులాలను మళ్లీ రాష్ట్ర బీసీ జాబితాలో చేర్చాలని ప్రయత్నించడం చట్టవిరుద్ధమని అన్నారు. సమావేశంలో ప్రొఫెసర్ సత్యనారాయణ, గడప శ్రీహరి, కుమారస్వామి, పృథ్వీరాజ్ యాదవ్, విఠల్, బీసీ కులాల సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.


ఖైరతాబాద్‌లో మొక్కలు నాటే కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి తదితరులు


కేఎల్ఎన్‌వై పార్కులో మొక్కలు నాటుతున్న ప్రైమ్ ఆస్పత్రి సీఈవో డాక్టర్ దేవానంద్



బ్రేక్ త్రూ సైన్స్ సొసైటీ ఆధ్వర్యంలో పీపుల్స్ ప్లాజా వద్ద చిన్నారులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించిన ఓయూ ప్రొఫెసర్ డాక్టర్ నాగేశ్వరరావు, సొసైటీ కార్యదర్శి ఎల్.శరత్, అధ్యక్షుడు గంగాధర్

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



బంజారాహిల్స్‌లోని కేర్ ఆస్పత్రిలో 'ప్లాస్టిక్ కాలుష్యానికి ముగింపు' కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది

హైదరాబాద్ సిటీ/బంజారాహిల్స్/ అమీర్‌పేట/ఖైరతాబాద్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఇన్‌చార్జి మహ్మద్ అజారుద్దీన్ అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఎర్రగడ్డ డివిజన్‌లోని కళ్యాణ్‌నగర్ పార్కులో ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నానాటికీ కాంక్రీట్ జంగల్‌గా మారుతున్న నగరంలో పర్యావరణాన్ని కాపాడాలంటే మొక్కలు నాటాల్సిన అవసరమెంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నగర ప్రధాన కార్యదర్శి దూడల రవి గౌడ్, నాయకులు రమేష్ నాయక్, సలాం, కిరణ్ యాదవ్, నయీమ్, శశికుమార్, యాకమ్మ పాల్గొన్నారు. సనత్‌నగర్‌లోని కంజర్ల లక్ష్మీనారాయణ యాదవ్ పార్కులో ప్రైమ్ ఆస్పత్రి సిబ్బందితో కలిసి ఆ ఆస్పత్రి సీఈవో డాక్టర్ దేవానంద్ 200 మొక్కలను నాటారు. 'ప్లాస్టిక్ కాలుష్యానికి ముగింపు' అనే థీమ్‌తో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని బంజారాహిల్స్‌లోని కేర్ ఆస్పత్రి గ్రూప్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ విశాల్ మహేశ్వరి ప్రారంభించారు. ఆస్పత్రి సిబ్బంది ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో చీఫ్ హ్యూమన్ రిసోర్సెస్ ఆఫీసర్ డాక్టర్ అమిత్ సింగ్, క్వాలిటీ ఆపరేషన్స్ వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ చౌరే పాల్గొన్నారు.


కళ్యాణ్‌నగర్ వెంచర్ త్రీ లోని పార్కులో మొక్కలు నాటుతున్న కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఇన్‌చార్జి మహ్మద్ అజారుద్దీన్ తదితరులు

వీధిదీపాల సమస్యలను పరిష్కరించాలి

ఖైరతాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): 48 గంటల్లో వీధిదీపాల సమస్యలను పరిష్కరించాలని జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన జీహెచ్ఎంసీ ఎలక్ట్రిక్ విభాగం(స్ట్రీట్ లైట్) అధికారులతో ప్రత్యేక రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీధి దీపాల నిర్వహణకు అవసరమయ్యే పరికరాలను, ఎల్ఈడీ లైట్లను సమకూర్చుకోవాలని సూచించారు. ఖైరతాబాద్, మాసాబ్‌ట్యాంక్, షేక్‌పేట ఫ్లై ఓవర్, ఫిలింనగర్ ఫుట్ ఓవర్ బ్రిడ్జి తదితర గుర్తించిన ప్రాంతాల్లో డెకరేటివ్ లైటింగ్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు.

పూడికను పూర్తిస్థాయిలో తొలగించాలి

ఖైరతాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో నీరు నిలిచే ప్రాంతాల్లో ఉన్న మ్యాన్‌హోళ్లు, క్యాచ్‌పిట్ల వద్ద పూడికను పూర్తిస్థాయిలో తొలగించాలని ఖైరతాబాద్ ఉప కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి సూచించారు. గురువారం ఆయన సర్కిల్‌లోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న పూడికతీత పనులను పరిశీలించారు. ఇంజనీరింగ్ అధికారులు పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ వర్షాకాలంలో ఇబ్బందులు లేకుండా చూడాలని, నాలా పూడికతీత పనులు సైతం వేగంగా పూర్తి చేయాలని ఆయన సూచించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం సర్వే


స్థానికుల నుంచి సమాచారం సేకరిస్తున్న అధికారులు

బంజారాహిల్స్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): నందగిరిహిల్స్ గురుబ్రహ్మనగర్‌లో జీ ప్లస్2 ఇందిరమ్మ ఇళ్లను నిర్మించేందుకు రాష్ట్ర హౌసింగ్ బోర్డు, రెవెన్యూ అధికారులు గురువారం పర్యటించారు. బస్తీలో నివసించే గిరిజనుల వద్ద వివరాలు సేకరించారు. ఫిలింనగర్ 18 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి నరసింహారావు, బస్తీ అధ్యక్షుడు గోపాల్‌నాయక్ అధికారులకు వివరాలను వెల్లడించారు. బస్తీ ఏర్పడి సుమారు 20 సంవత్సరాలు గడిచిందని గిరిజనులు గుడిసెలు వేసుకొని పక్కా ఇళ్ల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. వారికి న్యాయం చేసేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలని కోరారు. కాగా, కాలనీవాసులు కొన్ని విషయాలపై అభ్యంతరాలు వ్యక్తం చేయడం వల్ల నిర్మాణం పెండింగ్‌లో పడుతూ వచ్చిందన్నారు. అనంతరం అధికార బృందం కాలనీవాసులతో కూడా సంప్రదింపులు చేశారు. కాలనీకి బస్తీకి మధ్యలో ఉన్న స్థలంలో గ్రీనరీ అభివృద్ధి చేయాలని కాలనీవాసులు కోరారు. కార్యక్రమంలో షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి, హౌసింగ్ బోర్డ్ అధికారులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో జిమ్ ట్రైనర్ ఆత్మహత్య

అమీర్‌పేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ భరించలేక జీవితంపై విరక్తి చెంది ఓ జిమ్ ట్రైనర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన ఎస్ఆర్ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని డీకేరోడ్డులో బుధవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిగూడకు చెందిన సీహెచ్ నితీష్ (30) అదే ప్రాంతానికి చెందిన ఓ యువతిని 10 సంవత్సరాలుగా ప్రేమించి ఇటీవలే పెళ్లి చేసుకున్నాడు. కొంతకాలం క్రితం అమీర్‌పేట డీకేరోడ్డులోకి మకాం మార్చాడు. ఇక్కడ ఓ జిమ్‌లో ట్రైనర్‌గా పనిచేస్తున్నాడు. కాగా, బుధవారం సాయంత్రం భార్య వ్యక్తిగత పని నిమిత్తం పుట్టింటికి వెళ్లింది. ప్రతి రోజూ జిమ్‌కు వెళ్లాల్సిన నితీష్ ఇంట్లోనే ఉండిపోయాడు. రాత్రి నితీష్ తల్లి ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. విషయాన్ని తన పెద్ద కొడుకు నిహాల్‌కు తెలిపింది. వెంటనే నితీష్ భార్యకు సమాచారం అందించి డీకేరోడ్డులోని నివాసానికి చేరుకున్నారు. తలుపులు నెట్టి చూడగా తెరుచుకోలేదు. ఎంత పిలిచినా నితీష్ పలుకకపోవడంతో తలుపులను పగలగొట్టి ఇంట్లోకి వెళ్లి చూడగా అప్పటికే ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు అతడి వద్ద ఉన్న సెల్‌ఫోన్ మెసేజ్‌లను పరిశీలించి చూడగా పలు రుణ యాప్‌లలో అప్పులు తీసుకున్నట్లుగా వెల్లడైంది. అప్పుల బాధతోనే నితీష్ ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

రోడ్డు ప్రయాదంలో గాయపడిన వ్యక్తి మృతి

బేగంపేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రయాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన బేగంపేటలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుల్‌బర్గాకు చెందిన శివ(38) నగరంలోని పాత రాంగోపాల్‌పేట పోలీస్‌స్టేషన్ ప్రాంతంలో ఫుట్‌పాత్‌పై ఉంటూ పెయింటింగ్ పని చేస్తూ జీవిస్తున్నాడు. గత నెల 25వ తేదీన ప్లాజా జంక్షన్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికుల సమాచారం మేరకు గాయపడిన వ్యక్తిని పోలీసులు గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కరెంట్ షాక్‌తో..

బేగంపేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రహరీ నిర్మిస్తుండగా సమీపంలోని ట్రాన్స్‌ఫారం నుంచి విద్యుత్ షాక్ తగలడంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒరిస్సాకు చెందిన మహేష్(37) ఉపాధి కోసం నగరానికి వచ్చి మూసాపేటలో నివసిస్తున్నాడు. మేస్త్రీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం పినాక్ గార్డెన్ వద్ద ప్రహరీ నిర్మాణ పనికి వెళ్లాడు. సాయంత్రం 4 గంటల ప్రాంతంలో గోడ నిర్మిస్తుండగా సమీపంలోని ట్రాన్స్‌ఫారం నుంచి విద్యుత్ షాక్ తగలడంతో కిందపడిపోయాడు. ఆస్పత్రికి తరలించేలోగా మృతిచెందాడు. ఈయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య పార్వతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గృహిణి అదృశ్యం


మౌనిక

ఖైరతాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగానికి వెళ్తున్నానంటూ ఇంటి నుంచి వెళ్లిన మహిళ కనిపించకుండా పోయింది. ఖైరతాబాద్ ఎస్ఐ శ్రీరాములు తెలిపిన వివరాల ప్రకారం.. ఖైరతాబాద్ గాంధీనగర్‌కు చెందిన రాఘవేంద్ర కుమార్, మౌనిక(30) భార్యాభర్తలు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీరిద్దరు ఇతర రాష్ట్రాల్లో చదువుకుంటుండగా మౌనిక బేగంపేటలోని ఓ ప్రైవేట్ బ్యాంక్‌లో ఉద్యోగం చేస్తుంది. సోమవారం ఉదయం డ్యూటీకి వెళ్తున్నానని ఇంటి నుంచి బయలుదేరిన మౌనిక సాయంత్రం తిరిగి రాకపోవడంతో భర్త ఖైరతాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నామని పోలీసులు తెలిపారు.



తార్నాక జంక్షన్‌ను పరిశీలిస్తున్న ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిడ్

నేటి నుంచి తార్నాక జంక్షన్ మూసివేత

ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిడ్

తార్నాక, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : వాహనదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని శుక్రవారం నుంచి తార్నాక చౌరాస్తాను మూసి వేస్తున్నట్లు ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిడ్ స్పష్టం చేశారు. గురువారం ట్రాఫిక్ అధికారులతో కలిసి ట్రాఫిక్ జాయింట్ సీపీ తార్నాక చౌరాస్తాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వాహనదారులకు యూ టర్న్‌ల నుంచి విముక్తి కలిగించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలనే ఉద్దేశ్యంతో 45 రోజుల క్రితం పరిశీలనాత్మకంగా ట్రాఫిక్ జంక్షన్‌ను పునరుద్ధరించడం జరిగిందన్నారు, అయితే గతంలో కంటే వాహనాల సంఖ్య పెరగడం, రోడ్డు విస్తరణ పనులు చేపట్టకపోవడం వలన హబ్సిగూడ నుంచి మెట్టుగూడ, ఉస్మానియా యూనివర్సిటీ నుంచి లాలాపేట్ వెళ్లే ప్రధాన రహదారిలో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతుందని, దాంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు తమ పరిశీలనలో తేలిందని, ఈ మేరకు ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా తార్నాక జంక్షన్‌ను శుక్రవారం నుంచి మూసి వేయాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.



ఆహార శుభ్రత, నాణ్యత, పరిసరాల పరిశుభ్రతను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్ రెడ్డి తదితరులు

హోటళ్లలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

తార్నాక, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : వినియోగదారుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని హోటళ్లు, ఫుడ్ స్టాల్స్ యాజమాన్యాలు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్ రెడ్డి అన్నారు. గురువారం తార్నాకలోని పలు హోటళ్లు, టిఫిన్ సెంటర్‌లలో ఆకస్మిక తనిఖీలు చేసిన ఆమె ఆహార శుభ్రత, నాణ్యత, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. అనంతరం డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ, హోటళ్లు, టిఫిన్ సెంటర్‌ల యాజమాన్యాలు వినియోగదారుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నాణ్యత, పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు.

బస్టాపులను పాత గాంధీ స్థలంలోకి మార్చాలి

రెజిమెంటల్‌బజార్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న బస్టాపులను పాత గాంధీ ఆస్పత్రి స్థలంలోకి మార్చడం వలన ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలు తీరుతాయని నార్త్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌కు వివరించారు. గురువారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు జరుగుతున్నందున స్టేషన్ ముందు పది మీటర్ల స్థలం గార్డెన్ అభివృద్ధి చేయడానికి ఏసీ బస్ షెల్టర్లు అడ్డుగా ఉండటంతో రైల్వే అధికారుల సూచన మేరకు కమిషనర్ సందర్శించగా ఏసీపీ బస్ షెల్టర్ల మార్పు విషయం ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కమిషనర్ పాత గాంధీ ఆస్పత్రి స్థలాన్ని పరిశీలించారు. ఎస్సై సతీష్ రెడ్డి పాల్గొన్నారు.



మరాఠబస్తీలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

మరాఠ బస్తీలో క్షయవ్యాధి పరీక్షలు

అడ్డగుట్ట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : క్షయవ్యాధిపై ప్రజల్లో చైతన్యం కలిగిస్తున్నామని అడ్డగుట్ట ప్రభుత్వ ఆరోగ్యకేంద్రం ఇన్‌చార్జీ వైద్యాధికారి వీరు అన్నారు. గురువారం ఈ బస్తీలో 80 మందికి వైద్య పరీక్షలు స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించామన్నారు. 18 మంది క్షయ రోగుల నుంచి రక్తనమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీబీ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ సివిఎస్ రాజు, సుబ్బారావు, శాంతి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



ఆలయ ముఖద్వార మహోత్సవంలో దండుగుల యాదగిరి తదితరులు

ఘనంగా ఆలయ ముఖద్వార మహోత్సవం

సికింద్రాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): హస్మత్‌పేట్ చౌరస్తాలో నూతనంగా నిర్మించిన శివ దుర్గ ఎల్లమ్మ తల్లి సమేత దేవాలయంలో ముఖద్వార మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి నేతృత్వంలో పలువురి సహకారంతో ఇటీవల ఆలయ నిర్మాణం జరుగుతోంది. దీనిలో భాగంగా తమిళనాడు రాష్ట్రానికి చెందిన శిల్పులతో ముఖద్వారాలు రూపొందించి, గురువారం తెల్లవారుజాము నుంచి యజ్ఞం, హోమం తదితర పూజా కార్యక్రమాలతో ముఖద్వారా ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. హస్మత్‌పేట్, పాతబోయినపల్లి, మల్లికార్జునకాలనీ, అల్వాల్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు హాజరయ్యారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ, మాజీ శాసనసభ్యులు మైనంపల్లి హన్మంతరావు, కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యురాలు బాణుక నర్మద, మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, బోయినపల్లి మార్కెట్ చైర్మన్ రాగీరు ఆనంద్‌బాబు, కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ ఇన్‌చార్జి కోట నీలిమ, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్, బోయినపల్లి డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ పాల్గొన్నారు.

ఆస్పత్రిలో స్నేహితుడి తల్లిని చూడటానికి వెళ్లిన యువకుడి అదృశ్యం

బౌద్ధనగర్, జూన్5 (ఆంధ్రజ్యోతి): గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న స్నేహితుడి తల్లిని చూడటానికి వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమైన సంఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఏఎస్సై దివాకర్ వివరాల ప్రకారం.. మాణికేశ్వర్‌నగర్‌కు చెందిన గండికోట కుమార్ (29) లేబర్ పనిచేస్తుంటాడు. ఈనెల 3న మధ్యాహ్నం గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న స్నేహితుడి రాజ్ తల్లిని చూడటానికి వెళ్లి మళ్లీ తిరిగిరాలేదు. తన బావ కనిపించటంలేదని బావమరిది అరవింద్ బుధవారం రాత్రి చిలకలగూడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కుమార్‌కు నిత్యం మద్యం తాగే అలవాటు ఉందని దీనితో పాటు ఫిట్స్ అనారోగ్య సమస్యలున్నాయని, ఫోన్ వాడే అలవాటు లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



గాంధీ ఆస్పత్రి ఆవరణలో మొక్కను నాటిన సూపరింటెండెంట్ రాజకుమారితో వైద్యులు



మొక్కను నాటుతున్న మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రటరీ శంకర్ రావు చిలుకు స్వామి



రెజిమెంటల్‌బజార్‌లో మొక్కను నాటుతున్న కార్పొరేటర్ కొంతం దీపిక

పచ్చదనాన్ని కాపాడాలి

ఉత్సాహంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

అడ్డగుట్ట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ఇంటింటా మొక్కలు నాటడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజకుమారి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం గాంధీ ఆస్పత్రి ఆవరణలో వివిధ ప్రాంతాల్లో సూపరింటెండెంట్ మొక్కల్ని నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతీ ఒక్కరు మొక్కలను నాటి సంరక్షించాలని, ప్లాస్టిక్ వాడకం తగ్గించి గుడ్డ సంచులను మాత్రమే వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ రజిని, ఆర్ఎంఓ కల్యాణ్ చక్రవర్తి, వైద్యులు పాల్గొన్నారు.

కేంద్ర యూనియన్ కార్యాలయంలో..

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, రెజిమెంటల్‌బజార్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రటరీ డాక్టర్ శంకర్ రావు అన్నారు. గురువారం కేంద్ర యూనియన్ కార్యాలయంలో మొక్కలను నాటారు. రైల్వే కార్యక్రమంలో అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ ఉదయ భాస్కర్, సికింద్రాబాద్ డివిజన్ జనరల్ సెక్రటరీ రవీందర్, కోశాధికారి నర్సింహారెడ్డి, ఎంప్లాయిస్ క్రెడిట్ కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు చిలుకు స్వామి, తదితరులు పాల్గొన్నారు.

మోండా డివిజన్ రెజిమెంటల్‌బజార్ నెం.1 ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేటర్ కొంతం దీపిక మొక్కలను నాటారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్, సాగర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంజీవయ్య పార్కులో..

రాంగోపాల్‌పేట్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : హెచ్ఎండీఏ ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని గురువారం సంజీవయ్య పార్కులో ఉత్సాహంగా జరుపుకుంది. ఈ సందర్భంగా హెచ్ఎండీఏ సంచాలకులు కె.శ్రీనివాస్, సహాయ సంచాలకులు చక్రపాణి మొక్కలను నాటారు. కార్యక్రమంలో బుద్ధ పూర్ణిమ ప్రాజెక్ట్ అర్బన్ ఫారెస్ట్రీ వింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

రాంగోపాల్‌పేట్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : మక్తాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో వ్యవస్థాపకుడు మక్తాల జలందర్ గౌడ్ సోమసుంధరం వీధి, మంజు థియేటర్, ప్యాట్నీ సెంటర్ల మీదుగా ఎస్‌వీఐటీ వరకు మొక్కలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎస్‌వీఐటీలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మక్తాల ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.



పర్యావరణంపై ర్యాలీ నిర్వహిస్తున్న మక్తాల ఫౌండేషన్ సభ్యులు



మొక్కను నాటిన హెచ్ఎండీఏ సంచాలకులు శ్రీనివాస్



చెట్టు తరలింపు వివరాలను తెలుసుకుంటున్న జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్

నాటడమే కాదు.. కాపాడుకోవాలి: ట్రాఫిక్ ఏసీపీ

రాంగోపాల్‌పేట్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ బాధ్యత అంటే మొక్కలను నాటడమే కాదు వాటిని కాపాడడం, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని ఇవ్వడం కూడా అని నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ సరోజినీ దేవి రోడ్డులోని మంజూ థియేటర్ వద్ద ట్రాఫిక్‌కు అంతరాయంగా మారిన భారీ చెట్టును అక్కడి నుండి తొలగించి ప్యాట్నీ సెంటర్ వద్ద ఉన్న ఎస్‌వీఐటీ ప్రాంగణంలో నెలకొల్పారు. చెట్టు తరలింపు సమయంలో అటుగా వెళుతున్న జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ చెట్టు తరలింపు ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సామాజిక కార్యకర్త మక్తాల జలందర్ గౌడ్‌తో కలిసి కమిషనర్‌కు మామిడి మొక్కను బహుమతిగా అందజేశారు.



కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌తో నూతన పాలకమండలి సభ్యులు

గణేష్ టెంపుల్ పాలక మండలి ప్రమాణ స్వీకారం

రెజిమెంటల్‌బజార్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మకమైన గణేష్ టెంపుల్‌కు పార్కింగ్ సమస్యను పరిష్కరిం చడానికి కృషి చేస్తానని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. గురువారం సికింద్రాబాద్ స్టేషన్ రోడ్డులో ఉన్న గణేష్ టెంపుల్ నూతన పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఎంతో విశిష్టత కలిగిన ఆలయానికి పాలక మండలి సభ్యుడిగా నియమితులవడం అదృష్టమని ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని నూతన పాలక మండలి సభ్యులకు సూచించారు. ఎండోమెంట్ ఇనిస్పెక్టర్ శ్రీదేవి సభ్యులచేత ప్రమాణ స్వీకారం చేయించారు. చైర్మన్‌గా ప్రభాకర్ యాదవ్, సభ్యులు నరేందర్ యాదవ్, జాజుల ఆంజనేయులు, నాగులపల్లి మల్లేష్, వి.సంతోష్, రామ్ సాయి కుమార్, బట్టు భిక్షపతి, నందికంటి నాగమణి, నరేందర్, వేణుగోపాల్‌చారి, అనిల్‌యాదవ్, నిమ్మ వందన, మాణిక్యప్రభు, వంగ నరేష్ నియమితులయ్యారు. ఇన్‌చార్జి ఈవో అంజనాదేవి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బస్తీలో పక్కా ఇండ్లు నిర్మించి ఇస్తాం: ఎమ్మెల్యే శ్రీగణేష్

మారేడుపల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): బస్తీల అభివృద్ధిలో భాగంగా మోడల్ కాలనీలను ఏర్పాటు చేసి పేదలకు పక్కా ఇండ్ల నిర్మాణం కోసం స్థలం ఎంపిక కోసం రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ, పట్టణాభివృద్ధి శాఖ అధికారులతో కలిసి ఎమ్మెల్యే శ్రీగణేష్ గురువారం 150 డివిజన్ మారేడుపల్లి అంబేద్కర్ నగర్‌లో పర్యటించి స్థలాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బస్తీలలో అనువైన ప్రదేశాలను గుర్తించి అక్కడి పేదలకు జీ ప్లస్ 3 పద్ధతిలో ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి కాలనీలను మోడల్ కాలనీలుగా తీర్చిదిద్దాడానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. అందులో భాగంగానే అంబేద్కర్ నగర్‌లో ఎమ్మెల్యేతో పాటు తహసీల్దార్ భీమయ్య గౌడ్, డిప్యూటీ తహసీల్దార్ గ్రీష్మా, హౌసింగ్ డిపార్ట్‌మెంట్ ఏఈ జనార్ధన్ నాయక్, టిపిబిఓ క్రాంతి, ఏఈ వీరభద్రయ్య, టిడబ్ల్యూ సంధ్యారాణి, డిప్యూటీ ఈఈ శ్రీనాథ్ కాలనీలో పర్యటించారు. కాంగ్రెస్ నాయకులు సంతోష్ యాదవ్, వైష్ణవి, బాబురావు, రాజయ్య పాల్గొన్నారు.

ప్రాగా హౌజింగ్ సొసైటీ స్థలంలో సర్వే పూర్తి

సొంతింటి స్వప్నం నెరవేరిందని సొసైటీ సభ్యుల హర్షం

సికింద్రాబాద్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ప్రాగాలో పనిచేస్తున్న ఉద్యోగులకు, సిబ్బందికి అప్పట్లో కేటాయించిన భూములలో సొంత ఇల్లు కట్టుకోవాలన్న స్వప్నం నెరవేరే సమయం ఆసన్నమైందని ప్రాగా ఆఫీసర్స్ హౌజింగ్ కో ఆపరేటివ్ సొసైటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఓల్డ్ బోయినపల్లిలోని ప్రాగా ఆఫీసర్స్ హౌజింగ్ కో ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సొసైటీ సభ్యులు మాట్లాడుతూ ఇటీవల హైకోర్టు నుంచి వచ్చిన ఆదేశాల నేపథ్యంలో బాలానగర్ రెవెన్యూ అధికారులు ప్రాగా హౌజింగ్ సొసైటీ ఆధీనంలోని భూమిని సర్వే చేసినట్టు చెప్పారు. 40 సంవత్సరాలుగా పోరాటం చేస్తూ న్యాయస్థానం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే సర్వే చేయించినట్టు తెలిపారు. 1984లో కొనుగోలు చేసిన సమయంలో 18 ఎకరాల భూమి ఉండగా, రికార్డుల ప్రకారం ప్రస్తుతం 11 ఎకరాలు మాత్రమే మిగిలిందని పేర్కొన్నారు.

మిగిలిన భూమి అన్యాక్రాంతమైనట్టు వారు తెలిపారు. కొంత మంది వ్యక్తులు ఈ భూమిపై కన్నేసి తప్పుడు రిజిస్ట్రేషన్లు చేయిస్తూ, తప్పు దోవ పట్టించే యత్నం చేశారని వారు పేర్కొన్నారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా సర్వే పూర్తయిందని, త్వరలోనే మున్సిపల్ అనుమతులు తీసుకుని బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపడతామని వారు స్పష్టం చేశారు. కాగా గతంలో భూ యజమానులు తమకు విక్రయించిన భూమిలో మాత్రమే సర్వే చేయించామని, పక్కనే ఉన్న ఇతరుల భూ వివాద అంశాల జోలికి వెళ్లే అవసరం తమకు లేదని వారు స్పష్టం చేశారు. ప్రాగా హౌజింగ్ కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు దయానంద్, కోశాధికారి ఎస్.ఎస్.రాజు, సభ్యులు శంకర్ రావు, లక్ష్మణ్‌కుమార్, శ్రీనివాస్, శివాజీ, జగన్మోహన్‌రెడ్డి, కుమారస్వామి, అపర్ణదేవి, జాక్కీ సుల్తానా తదితరులు పాల్గొన్నారు. కాగా భూ సర్వే నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్య కింద బోయినపల్లి పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



మాట్లాడుతున్న ప్రాగా ఆఫీసర్స్ హౌజింగ్ కో ఆపరేటివ్ సొసైటీ సభ్యులు

ఆసుపత్రికి భద్రత ఏదీ?

తిరుమలగిరి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఎంతో మందికి వైద్య సేవలు అందిస్తున్న ఆసుపత్రికి భద్రత కరువైంది. అధికారుల నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం వెరసి ఆసుపత్రిలో ఆకతాయిలకు అడ్డాగా మారింది. లాల్‌బజార్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తిరుమలగిరి లాల్‌బజార్ తదితర ప్రాంతాలకు చెందిన రోగులు అధిక సంఖ్యలో ఆరోగ్య కేంద్రానికి విచ్చేసి వైద్య సేవలు పొందుతుంటారు. ప్రభుత్వం పౌరులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో కొన్నేళ్ల క్రితం ఆసుపత్రిని నిర్మించారు. అయితే ఆసుపత్రిలో సాయంత్రం వేళ కొందరు యువకులు క్రికెట్ ఆడుతూ నానా హంగామా చేస్తున్నారు. వాచ్‌మన్ లేకపోవడంతో ఆకతాయులకు ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారింది. సాయంత్రం 8 అయితే చాలు.. కొంతమంది ఆ ప్రాంతానికి చేరుకుని గేటు దూకి లోపలికి ప్రవేశించి క్రికెట్ ఆడడంతో పాటు గంజాయి బ్యాచ్ కూడా అక్కడికి చేరుకుంటుందని సమాచారం. పాఠశాలలు, కళాశాలలు వేసవి సెలవుల్లో మూసివేసి ఉండడంతో ఆసుపత్రి కాంపౌండ్ గ్రౌండ్‌గా మారింది. క్రికెట్ ఆడుతుండగా బాల్ తగిలి కిటికీల అద్దాలు పగిలిన సందర్భాలు కూడా ఉన్నాయి. తిరుమలగిరి పోలీస్ స్టేషన్ అధికారులు కంటోన్మెంట్ అధికారులు స్పందించి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో క్రికెట్ ఆడుతున్న యువకులను కట్టుదిట్టం చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. దీంతో పాటు క్రీడా పోటీలలో యువత ఘర్షణలకు దిగుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పక్కనే ఉన్న పోలీస్ క్వార్టర్స్‌లో మహిళలు, చిన్నారులు ఆ ప్రాంతం గుండా రాకపోకలు కొనసాగించాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



లాల్‌బజార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

కౌన్సెలింగ్ ఇస్తాం

ప్రభుత్వ ఆసుపత్రిలో సాయంత్రం పూట యువత క్రికెట్ ఆడుతున్నట్లు తమ దృష్టికి వచ్చింది. క్రికెట్ ఆడకుండా యువతకు అదే ప్రాంతంలో కౌన్సెలింగ్ ఇస్తాం. దీంతోపాటు ఆ ప్రాంతంలో పోలీసుల బందోబస్తును కూడా ఏర్పాటు చేస్తాం.

- నాగరాజు, ఇన్‌స్పెక్టర్

ఇంట్లో పనిచేస్తానని వచ్చి నగలు చోరీ

నిందితురాలి అరెస్ట్.. రిమాండ్

అడ్డగుట్ట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ఇంట్లో పనిచేస్తానని వచ్చిన ఓ మహిళ బీరువాలో ఉన్న నగల్ని కాజేసిన ఘటన లాలాగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ రఘుబాబు, క్రైమ్ ఎస్సై షాహేద్ వివరాల ప్రకారం.. తార్నాక విజయపురి కాలనీలో ఉంటున్న వెంకటేశ్వర్లు కొద్ది రోజుల క్రితం విజయపురిలో కొత్తగా ప్లాట్ కొనుక్కొని కుటుంబ సమేతంగా చేరారు. ఈ క్రమంలో గత నెల 31న వెంకటేశ్వర్లు ఇంటికి ఓ మహిళ నేరుగా వచ్చి ఇంటి పని కోసమని వచ్చామని నమ్మకంగా పనిచేస్తామని చెప్పడంతో అదే రోజు వెంకటేశ్వర్ భార్య ఆమెను పనిలోకి తీసుకుంది. అదే రోజు ఇంట్లో పనిచేసి హడావిడిగా ఇంటికి వెళుతున్నానని చెప్పగా వెంకటేశ్వర్ భార్య సెల్ నెంబర్ ఇంటి అడ్రస్ ఇవ్వాలనడంతో తరువాత ఇస్తానంటూ మహిళ పారిపోయే ప్రయత్నం చేయగా యజమానురాలికి అనుమానం వచ్చి ఇంట్లో ఉన్న బీరువా తెరిచి చూడగా రెండు జతల బంగారు చెవి కమ్మలు, రెండు బంగారు గొలుసులు, బంగారు ఉంగరం కనిపించలేదు. దీంతో ఆమె అదే రోజు లాలాగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వెంటనే పోలీసులు చుట్టుపక్క ప్రాంతాల్లో పనిమనిషి కోసం వెతికినప్పటికీ ఫలితం దక్కలేదు. బుధవారం సీసీ కెమెరాల ఆధారంగా విశ్వసనీయ సమాచారం మేరకు రషీద అనే మహిళను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకుంది. నిందితురాలు గతంలో చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇదే తరహా మోసానికి పాల్పడిందని విచారణలో తేలింది. నిందితురాలిని అరెస్టు చేసి చంచల్‌గూడ జైలుకు తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బేగంపేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన బేగంపేటలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గుల్బర్గాకు చెందిన శివ (38) నగరంలోని పాత రాంగోపాల్‌పేట పోలీస్ స్టేషన్ ప్రాంతంలో ఫుట్‌పాత్‌పై ఉంటూ పెయింటింగ్ పనిచేస్తున్నాడు. గత నెల 25న ప్లాజా జంక్షన్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికుల సమాచారం మేరకు గాయపడిన వ్యక్తిని పోలీసులు గాంధీ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సనత్‌నగర్‌లో కరెంటు షాక్‌తో వ్యక్తి మృతి

బేగంపేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రహరీ నిర్మిస్తుండగా సమీపంలోని ట్రాన్స్‌ఫారం నుంచి కరెంట్ షాక్ తగలడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒరిస్సాకు చెందిన మహేష్ (37) మూసాపేటలో ఉంటూ మేస్త్రీ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. బుధవారం పినాక్ గార్డెన్ వద్ద ప్రహరీ నిర్మాణ పనికి వెళ్లాడు. సాయంత్రం గోడ నిర్మిస్తుండగా సమీపంలోని ట్రాన్స్‌ఫారం నుంచి విద్యుత్ షాక్ తగలడంతో కింద పడిపోయాడు. ఆసుపత్రికి తరలించే లోగా మృతి చెందాడు. భార్య పార్వతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సికింద్రాబాద్‌లో వృద్ధుడి మృతి



గుర్తుతెలియని వ్యక్తి

అడ్డగుట్ట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్‌లో మృతి చెందిన ఓ వృద్ధుడిని గోపాలపురం పోలీసులు మార్చురీకి తరలించారు. ఎస్సై వేణుగోపాల్ వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ లోని రేతిఫైల్ బస్టాండు వద్ద గుర్తుతెలియని 55 ఏళ్ల వృద్ధుడు చనిపోయి ఉండగా పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి వద్ద ఎలాంటి అడ్రస్ ఆధారాలు లభించలేదని పోలీసులు తెలిపారు. మృతుడి గురించి తెలిసినవారు వెంటనే గోపాలపురం పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

లక్షా నలభై నాలుగు వేల నగదు స్వాధీనం

బేగంపేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్ సందర్భంగా బెట్టింగ్ నిర్వహించి..నగదు మార్చుకునే క్రమంలో విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు అతడి ఇంటిపై దాడి చేసి అతని వద్ద ఉన్న లక్షా నలభై నాలుగువేల ఐదొందల రూపాయలను స్వాధీనం చేసుకున్న ఘటన బుధవారం బేగంపేటలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. పాన్ బజార్‌కు చెందిన కిరణ్ క్రికెట్ బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నాడు. ఇటీవల ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్‌పై ఇద్దరి వద్ద బెట్టింగ్ నిర్వహించాడు. ఒకరు బెంగళూరు జట్టుపై పదివేలు బెట్టింగ్ పెట్టగా, మరొక వ్యక్తి పంజాబ్ జట్టుపై లక్షకు పైగా బెట్టింగ్ పెట్టాడు. పది వేలు బెట్టింగ్ పెట్టిన వ్యక్తి గెలవడంతో డబ్బు తిరిగి ఇచ్చాడు. ఓడిన జట్టుపై బెట్టింగ్ పెట్టిన వ్యక్తి డబ్బును పోగొట్టుకున్నాడు. ఈ క్రమంలో కిరణ్ డబ్బులు మార్చుకునే క్రమంలో పోలీసులకు సమాచారం అందడంతో బేగంపేట పోలీసులు అతని ఇంటిపై దాడి చేశారు. అతడిని అదుపులోనికి తీసుకుని అతని వద్ద ఉన్న రూ. 1,44,500 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.